క్లుప్తంగా

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



మాట్లాడుతున్న ఎంవీఐ రాజబాబు

గుంతకల్లుటౌన్: రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజబాబు తెలిపారు. గురువారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రమాదాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానిక ఆర్టీసీ డిపోలో అవగాహన కల్పించారు. డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. చలికాలంలో పొగమంచు ముప్పు పొంచి ఉంటుందని, పొద్దునే బస్సులు నడిపేటప్పుడు వాహన వేగానికి కళ్లెం వేయాలని సూచించారు. డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్‌ను వాడొద్దన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.వి.గంగాధర్, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: పెండింగ్‌లో ఉన్న ఇంటి, నీటి పన్నులు వెంటనే వసూలు చేయడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కోటి రూపాయలకు పైగా ఇంటి పన్ను, నీటి పన్నులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెలాఖరుకు పెండింగ్‌లో ఉన్న పన్నులు వసూలు చేయాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని క్యాంటీన్ నిర్వాహకులను హెచ్చరించారు.

చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

గుత్తి రూరల్: చిన్నారుల ఆరోగ్యం పట్ల వైద్య, ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేయాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్ సూచించారు. మండలంలోని కొత్తపేటలో విలేజ్ హెల్త్ క్లినిక్ కార్యక్రమాన్ని గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు క్రమం తప్పకుండా వెళ్తూ చిన్నారులు, విద్యార్థులకు పరీక్షలు చేయాలన్నారు. ఎల్‌సీడీ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రతి గృహం సందర్శించి సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రెడ్డెమ్మ, శోభారాణి, శివప్రసాద్, నాగమ్మ, ఆశా కార్యకర్తలు సరోజ, లక్ష్మిదేవి, తాయమ్మ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలిస్తున్న 'ఆ నలుగురు' సభ్యులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ఉన్న మదర్‌థెరిస్సా మిషనరీస్ ఆఫ్ చారిటీ నిర్మల్‌హృదయ్ భవన్‌లో ఆశ్రయం పొందుతూ అనారోగ్యంతో మృతి చెందిన మునిలక్ష్మి అనే వృద్ధురాలి మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. గురువారం చారిటీ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు వృద్ధురాలి మృతదేహాన్ని అంబులెన్స్‌లో పాతగుంతకల్లులోని హిందూ శ్మశాన వాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు రవితేజ, వంశీ, రవీంద్ర, వేణు. పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్‌కు మోక్షమెన్నడో?

- వాహనదారులకు ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందిపడుతున్న 'నెట్టికంటి' భక్తులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

గుంతకల్లు: గుంతకల్లు నుంచి కసాపురం వెళ్లే రహదారిలో సత్యనారాయణపేట వద్ద రైల్వే అండర్‌పాస్ ఇరుకుగా ఉండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు–గుత్తి ప్రధాన రైలు మార్గంలో ఈ అండర్‌పాస్ ఉంది. కొన్ని దశాబ్దాల కిందట అప్పటి పరిస్థితులకు అనుగుణంగా అండర్‌పాస్ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం పట్టణ జనాభా భారీగా పెరిగిపోవడంతో వాహనాదారుల సంఖ్య రోజురోజుకూ రెట్టింపు అవుతుంది. దీనికి తోడు ప్రముఖ పుణ్యక్షేత్రం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి అనేక ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు నిత్యం కసాపురానికి వస్తుంటారు. అంతేకాకుండా ఈ మార్గంలోనే ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ తదితర కార్యాలయాలకు వెళ్లే అధికారులతోపాటు ప్రజలు, ఇతర పనుల మీద ఇటు పట్టణంలోకి రావాలన్నా.. అటు కర్నూలు, పత్తికొండకు వెళ్లాలన్నా ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

శని, మంగళవారాల్లో మరింత ఇక్కట్లు..

రోజూ 1000కు పైగా వాహనాలు ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నాయి. ఇక శనివారం, మంగళవారం నెట్టికంటుడి దర్శనం కోసం వచ్చే భక్తులతో రెట్టింపు వాహనాలు తిరుగుతాయి. అసలే చాలా ఇరుకుగా ఉన్న సత్యనారాయణపేట అండర్‌పాస్‌లో పెద్ద ఎత్తున వాహనాలు పోవడం పరిపాటి మారింది. ఆ సమయంలో మోరీ దాటాలంటే దాదాపు అరగంటకు పైగా సమయం పడుతుందని వాహనాదారులు వాపోతున్నారు. దీంతో చాలా మంది ట్రాఫిక్‌ను చూసి భయపడి డీఆర్‌ఎం కార్యాలయం మీదుగా రాకపోకలు సాగిస్తారు. దీంతో దాదాపు రెండు కి.మీలు అదనంగా ప్రయాణించాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఇంకా పెద్దపెద్ద లారీలు. ప్రైవేట్ బస్సులు, ఇతరత్ర వాహనాలను ఈ మార్గం గుండా వెళ్లేలేవు. ఎందుకంటే అండర్‌పాస్ ఎత్తు తక్కువగా ఉండటంతో ఎక్కడ ఈ వాహనాలు ఇరుక్కుపోతాయే అని రెండు వైపులు ఇనుప దిమ్మెలతో అడ్డుకట్ట వేయడంతో కేవలం ఆర్టీసీ బస్సులు, ఇతరత్ర వాహనాలు మాత్రమే వెళ్తాయి. ఇతరత్ర వాహనాలను పాత గుత్తి రోడ్డులోని విద్యామందరం అండర్‌పాస్ నుంచి మళ్లించడంతో కొంత మేర వాహనాల రాకపోకలకు ఊరట ఉంటోంది.

మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ కృషితో రైల్వే బోర్డు దృష్టికి సమస్య..

పట్టణాభివృద్ధికి అవరోధంగా ఉన్న కసాపురం రైల్వే అండర్‌పాస్, ధర్మవరం రైల్వే ఎల్‌సీ గేట్ నిర్మాణాల విషయమై మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఎంతో కృషి చేశారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య సాయంతో సమస్యను పలుమార్లు రైల్వే బోర్డుకు తీసుకుపోయారు. దీంతో ధర్మవరం రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ స్థానంలో ఆర్‌యూబీ నిర్మాణానికి దాదాపు రూ.8.33 కోటుతో నిధులు విడుదల చేయించి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే కసాపురం రైల్వే అండర్‌పాస్ విస్తరణకు దాదాపు రూ.8 కోట్ల అంచనాలతో రైల్వే అధికారులు అంచనాలు తయారు చేశారు. ఈ విషయాలపై ప్రస్తుత ప్రజాప్రతినిధులు కొంత మేర దృష్టి సారిస్తే ఈ మోరీ, ధర్మవరం ఎల్‌సీ గేట్ పనులు పూర్తి చేయవచ్చని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అరగంట పడుతోంది



చిన్నపాటి వాహనం వెళ్లాలన్నా.. అండర్‌పాస్ ఇరుకుగా ఉండటంతో తరుచూ ట్రాఫిక్ జామ్ కావడంతో ఈ కొద్ది ప్రయాణం నరకంగా కనిపిస్తుంది. రెండు వైపులా 300 మీటర్ల మేర నిలబడపోయిన ట్రాఫిక్‌ను దాటుకుని వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. దీంతో ఈ టైమ్‌ను కవర్ చేయడానికి శ్మశాన వాటికి మార్గం నుంచి విద్యా మందరం అండర్‌పాస్ మీదుగా తిరిగి వెళ్తున్నాం.

– కృష్ణనాయక్, గుంతకల్లు

ఫారెస్టు ఆక్రమిస్తే చర్యలు



ఫారెస్టులో అక్రమంగా నాటిన మొక్కలను తొలగిస్తున్న బీట్ ఆఫీసర్ మాధవి

యాడికి: రిజర్వ్ ఫారెస్టు ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఫారెస్టు సెక్షన్ అధికారి నారపరెడ్డి హెచ్చరించారు. రెండు రోజుల క్రితం మండలంలోని రాయలచెరువు కంపార్ట్‌మెంట్ 620వ నంబరులోని రిజర్వ్ ఫారెస్టులో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో జేసీబీతో కొంత భూమిని సదరు చేసి మామిడి చెట్లు, అల్లనేరేడు మొక్కలు నాటారు. గురువారం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గ్రామ అటవీ అధికారి మాధవి క్షేత్ర స్థాయికి వెళ్లి రిజర్వ్ ఫారెస్టులో అక్రమంగా నాటిన మొక్కలను పరిశీలించి గుత్తి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు సెక్షన్ అధికారి నారపరెడ్డి యాడికి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి, పోలీస్టేషన్‌లో సీఐ ఈరన్నకు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఎస్ఓ ట్లాడుతూ రిజర్వ్ ఫారెస్ట్ భూమిని ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. ఫారెస్టులో మొక్కలు నాటిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం అక్రమంగా నాటిన మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ మాధవి, ఏబీఓ చంద్ర శేఖర్ పాల్గొ న్నారు.

రహదారి భద్రతను బాధ్యతగా తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణుడు

తాడిపత్రి అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలోని డ్రైవర్లు రహదారి భద్రతను బాధ్యతగా తీసుకోవాలని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు అన్నారు. డిపో మేనేజర్ శంకర్ ఆధ్వర్యంలో తాడిపత్రి ఆర్టీసీ డిపోలో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, డీఎస్పీ రామకృష్ణుడు హాజరయ్యారు. రహదారి ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా తీసుకుంటున్న చర్యలపై వివరించారు. రహదారి భద్రతా వారోత్సవాలు జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకూ జరగనున్నాయన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ల నుంచే ప్రమాదాల నివారణ జరగాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన చర్యలను ఆర్‌ఎం వివరించారు. ఒక్కపై ఒక్క ప్రమాదం కూడా జరగకూడదని డ్రైవర్లకు ఆర్‌ఎం సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సాయి ప్రసాద్, రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి, ఆర్టీసీ డ్రైవర్లు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

గుత్తి రూరల్/గుత్తి: మండలంలో గురువారం వేర్వేరు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో గురువారం ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. గుత్తి పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన సంతోష్, శివ ద్విచక్రవాహనంలో నంద్యాల జిల్లా డోన్‌కు బయలుదేరారు. పొదొడ్డి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ప్యాపిలి వైపు వెళ్తున్న ఆటో వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ఘటనలో సంతోష్‌కు ఎడమ కాలు విరిగి తీవ్రంగా గాయపడగా శివకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం సంతోష్‌ను అనంతపురానికి తరలించారు.

▸▸ నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పొదొడ్డి గ్రామానికి చెందిన జయరాముడు, ఐదు నెలల గర్భవతి అయిన కుమార్తె రజినిని గుంతకల్లు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఊబిచెర్ల గ్రామ శివారులో బైక్‌ను అనంతపురం వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన జయరాముడు, రజనిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఇద్దరినీ అనంతపురం తరలించారు.

▸▸ గుత్తి మండలం పోతుదొడ్డి గ్రామానికి చెందిన రామన్న, శివయ్య బైక్‌లో గుత్తికి వెళ్తుండగా.. కుక్క అడ్డు రావడంతో బైక్ బోల్తా పడింది. ఘటనలో గాయపడిన ఇరువురిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



బీకేఎస్ నుంచి శింగనమలకు వెళ్లే రోడ్డులో మట్టి వేసుకుని రాంగ్ రూట్‌లో వెళ్తున్న ట్రాక్టర్

రాంగ్ రూట్..

రైట్ రైట్

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. రాంగ్ రూట్‌లో వెళ్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. బుక్కరాయసముద్రం నుంచి శింగనమలకు వెళ్లే మార్గంలో రోడ్డుకు మధ్యలో డివైడర్లు ఉన్నాయి. ఆ డివైడర్లలో చెట్లు ఏపుగా పెరగడంతో అటు వైపు వారు కనిపించని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ట్రాక్టర్ డ్రైవర్లు నిబంధలను ఉల్లంఘిస్తున్నారు. రాంగ్‌రూట్‌లో మట్టి వేసుకుని వెళ్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొడితే అంతే సంగతులు. ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్‌టీఏ, పోలీసు అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



బైక్‌లో ప్రమాదకర ప్రయాణం



రాంగ్ రూట్‌లో వెళ్తున్న ట్రాక్టర్

సిరులు కురిపిస్తున్న చామంతి



పెద్దపప్పూరు సమీపంలో చామంతి పూలు కోస్తున్న కూలీలు

- బెంగుళూరు, నెల్లూరు మార్కెట్లకు పూల ఎగుమతి
- ధరల పెరుగుదలపై రైతుల హర్షం

పెద్దపప్పూరు: చామంతి పూల సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. పదేళ్ల క్రితం మండలంలో రెండెకరాల్లో చామంతి పూలసాగుతో ప్రారంభమై నేడు 40 ఎకరాల్లో రైతన్నలు సాగు చేస్తున్నారు. తాడిపత్రి నియోజక వర్గంలో ఎక్కువగా చామంతి పంటను పెద్దపప్పూరు మండల కేంద్రంలోనే సాగుచేస్తున్నారు. ఎకరానికి దాదాపు రూ.70 నుంచి రూ.90 వేల వరకూ పెట్టుబడి అవుతుందని, మొక్కనాటిన 60 రోజుల నుంచి 30 రోజుల పాటు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో పూల నాణ్యతను బట్టి నెల్లూరు, బెంగుళూరు మార్కెట్టులో కిలో రూ.80 నుంచి రూ.120 ధర పలుకుతోందన్నారు.

పదేళ్లుగా చామంతి సాగు చేస్తున్నాను



చామంతి పంటను గత పదేళ్లుగా సాగుచేస్తున్నాను. మెలకువలు పాటించి పంట సాగు చేస్తే మార్కెట్‌లో ధరను బట్టి ఆశించిన దిగుబడి సాధించవచ్చు. చామంతులను ఎక్కువగా నెల్లూరు మార్కెట్‌కు తరలిస్తాం. ప్రస్తుతం మార్కెలో పూల నాణ్యతను బట్టి కిలో రూ.80నుంచి రూ. 110 ధర పలుకుతోంది. పెట్టుబడి పోనూ ఎకరానికి రూ.50 వేలు తప్పక వస్తుంది.

–కొండయ్య, రైతు

ధర బాగుంది



ఏటా చామంతి పూలసాగు చేస్తున్న రైతుల అభిప్రాయాలను తెలుసుకుని కొత్తగా ఎడుఎకరాల్లో చామంతి పంటను సాగుచేస్తున్నాను. ప్రస్తుతం మార్కెట్టులో ధర బాగుంది. మాఘమాసం ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుండడంతో మరింత ధర పలికే అవకాశాలున్నాయి. పెట్టుబడి పోను ఎకరానికి రూ.80 వేలు మిగలవచ్చని భావిస్తున్నా.

– మహ్మద్ గౌస్, రైతు

సూచనలు పాటించాలి



నియోజకవర్గంలోని పెద్దపప్పూరులో దాదాపు 40 ఎకరాల్లో చామంతి పంటను సాగుచేస్తున్నారు. పూల నాణ్యతను బట్టి నెల్లూరు, బెంగుళూరు మార్కెట్టులో మంచి ధర పలుకుతోంది. ఏ పంట సాగుచేసినా అధికారుల సలహాలు పాటిస్తే దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

– ఉమాదేవి హెచ్ఓ తాడిపత్రి

గ్రామాభివృద్ధికి తోడ్పడాలి



ఆవులాంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు: గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆవులాంపల్లి, జి.వెంకటాంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేసి డ్రైనేజీని అభివృద్ధి పరచాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ నరసింహారెడ్డి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

'విగ్రహ ప్రతిష్టను అడ్డుకోవడం దారుణం'

గార్లదిన్నె: తెనాలిలో అంబేడ్కర్ విగ్రహం ప్రతిష్ఠించకుండా అడ్డుకోవడం దారుణమని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప అన్నారు.గురువారం ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నా.. మంత్రి నాదెండ్ల మనోహర్ విగ్రహ ప్రతిష్టతను అడ్డుకోవడం తగదన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎవరూ అడ్డు చెప్పరాదన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై ఎవరైనా అడ్డుచెబితే దళిత సంఘాల నాయకులను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలి

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు, కోటంకలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈనెల 20 నిర్వహించే దేవర కార్యక్రమం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా సూచించారు.గురువారం ఎస్ఐ మర్తాడు, కోటంక గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమయ్యారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా, పార్టీలకు అతీతంగా అందరూ కలసి దేవర చేసుకో వాలని ప్రజలకు సూచించారు. రెండు గ్రామాల్లో దేవర కార్యక్రమాలకు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి, పాళ్యం పరిధిలోని సబ్–స్టేషన్ల విద్యుత్ సరఫరాలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ మధుసూదన్‌రావు గురువారం తెలిపారు. సబ్–స్టేషన్లలో 33/11 కేవీ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కరెంట్ అంతరాయాన్ని ఆయా సబ్–స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఇరువర్గాల ఘర్షణ



గాయపడ్డ రంగనాథ్

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో రస్తా విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రంగనాథ్, చంద్రయ్య, పెద్ద చంద్రయ్య, చంద్రశేఖర్, రాఘవేంద్ర, కుమార్‌కు ఇంటి సమీపంలో కొన్ని నెలలుగా రస్తా విషయంలో గొడవలు ఉండేవి. ఈ క్రమంలో గురువారం మరోమారు ఇరువర్గాలు గొడవ పడి, దాడులకు పాల్పడ్డారు. గాయపడిన రంగనాథ్‌ను కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ విజయకుమార్

శింగనమల: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విజయకుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని తరిమెల గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ఎంత వారైనా ఉపేక్షించమన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్టు ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ తప్పక ఉండాలన్నారు. గ్రామంలో చిన్న చిన్న విషయాలకు ఘర్షణ పడకుండా , సమస్యలు వస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ విలేకరి అరెస్టు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతంలో హెచ్‌ఎం టీవీ చానల్ విలేకరిని అంటూ బెదిరింపులకు దిగుతూ డబ్బును డిమాండ్ చేస్తున్న చిన్నబాబుతోపాటు అతని సహాయకుడిగా ఉన్న తిమ్మదాసును బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నామని అప్‌గ్రేడేషన్ సీఐ శివగంగాధర్‌రెడ్డి గురువారం తెలిపారు. తాడిపత్రి పట్టణంలోని నందలపాడుకు చెందిన వీరు మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలోని బొరుగుల ఫ్యాక్టరీలో విలేకరిగా చెప్పి అందులో పనిచేస్తున్న వారితోపాటు నిర్వాహకుడిని బెదిరించి డబ్బులు తీసుకున్నారన్నారు. పట్టణంలోని గానుగ వీధిలో ఉంటున్న దుకాణంలో కూడా బెదిరించే ప్రయత్నం చేశారన్నారు. బొరుగుల ఫ్యాక్టరీ నిర్వాహకుని ఫిర్యాదు మేరకు నకిలీ విలేకరితో పాటు అతని సహాయకుడిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.